# అపకారికి ఉపకారం

ఆ ఊర్లోకల్లా అదే చాలా పెద్ద క్లబ్బు. ఓ ప్రైవేట్ వ్యక్తి ఆ క్లబ్బు నడుపుతూ లక్షల రూపాయలు సంపాదించాడని ఆ ఊర్లో అందరూ చెప్పుకుంటారు. ఆ క్లబ్బులో లాన్ టెన్నిస్, షటిల్ బ్యాడ్మింటన్, బిలియర్డ్స్ మొదలైన ఎన్నో గేమ్స్ ఆడే సౌకర్యాలున్నప్పటికీ ఎక్కువమంది ప్లేయింగ్ కార్డ్స్ ఆడటానికే ఆ క్లబ్బుకు వస్తుంటారు. ఆ క్లబ్బులో ఓ స్విమ్మింగ్‌పూల్ కూడా ఉంది. ఆ క్లబ్బులో సభ్యత్వం పొందాలంటే చాలా పెద్దమొత్తమే సభ్యత్వరుసుముగా చెల్లించవలసి ఉంటుంది.

ఆ ఊర్లోని ప్రముఖ వ్యక్తులంతా ఆ క్లబ్బుకొస్తుంటారు. ఆ క్లబ్బులో సభ్యత్వం పొందటాన్ని ఓ స్టేటస్ సింబల్‌గా భావిస్తారు. ఆ క్లబ్బుకొచ్చే వాళ్ళల్లో పాఠశాలల్లో పనిచేసే టీచర్లుంటారు, యూనివర్శిటీల్లో పనిచేసే లెక్చరర్లుంటారు. రెవెన్యూ, కమ్మర్షియల్, ఎక్సైజ్ ఆఫీసుల్లో పనిచేసే ఉద్యోగస్తులుంటారు. పోస్టాఫీసులు, బ్యాంకులు, ఇన్సూరెన్స్ కంపెనీలులాంటి సంస్థల్లో పనిచేసే ఆఫీసర్లుంటారు. పోలీసు డిపార్ట్‌మెంట్‌లో పనిచేసే ఎస్సైలు, సీ.ఐలు, డీఎస్పీలుంటారు. వీళ్ళేకాకుండా బడా కాంట్రాక్టర్లు, వ్యాపారస్తులు కూడా ఉంటారు.

పెద్ద ఏ.సీ. హాల్లో యేడినిమిది టేబుల్స్, ఒక్కొక్క టేబుల్ చుట్టూ ఆరు కుర్చీలు అరేంజ్ చెయ్యబడి ఉంటాయి. ప్రతి టేబుల్ దగ్గర నల్గురైదుగురు కూర్చొని అర్ధరాత్రి దాటేవరకు కార్డ్స్ ఆడుతుంటారు. కొందరేమో డబ్బులు పోగొట్టుకొని యేడుపు ముఖాలతో, కొందరేమో డబ్బులు గెల్చుకొని ప్రసన్న వదనాలతో తమతమ ఇళ్ళకు వెళ్తుంటారు. పేకాట ఆడుతున్న చాలామంది విస్కీలు, బ్రాండీలు సేవిస్తుంటారు.

ఆరోజు ఓ టేబుల్‌చుట్టూ నల్గురు వ్యక్తులు కూర్చొని పేకాడుతున్నారు.

"ఛీఛీ! మళ్ళీ ఫుల్‌కౌంట్" అన్నాడు నారాయణమూర్తి తనచేతిలో ఉన్న కార్డ్స్‌ని టేబుల్‌కేసి కొడ్తూ. నారాయణమూర్తి ఆ ఊర్లో ఉన్న యూనివర్శిటీలో లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు.

"మీ జీతంలో సగం పేకాట మీదనే తగిలేస్తున్నట్టున్నారు" అన్నాడు మనోహరరావు "షో" అంటూ తన చేతుల్లో ఉన్న కార్డ్స్‌ని మిగతావాళ్ళకు చూపిస్తూ.

మనోహరరావు పెద్ద కాంట్రాక్టర్ కమ్ పొలిటీషియన్. ఒకసారి ఎం.ఎల్.ఏ.గా గెలిచాడు. రెండోసారి పోటీచేసి ఓడిపోయాడు.

"మీదెప్పుడూ విన్నింగ్ హ్యాండే. మీ చేతుల్లో యేదో మ్యాజిక్కుంది" అన్నాడు సురేందర్‌రావు తన చేతుల్లో ఉన్న కార్డ్స్‌ని చూపించి. సురేందర్ ఆ ఊరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెడ్‌మాస్టర్‌గా పనిచేస్తున్నాడు.

"గెలవాలంటే చేతిలో మ్యాజిక్కు కాదు... బుర్రలో తెలివుండాలి" అన్నాడు ధర్మారావు.

ధర్మారావు ఆ ఊర్లో చార్టర్డ్ ఎకౌంటెంట్‌గా పనిచేస్తున్నాడు.

మనోహరరావు నాల్గో గేమ్ తర్వాత ఐదో గేమ్‌కోసం కార్డ్సని చాలా నేర్పుగా కలుపుతూ నల్గురికీ పంచసాగాడు.

తనకొచ్చిన కార్డ్సని చూసి "ఛీఛీ!" అన్నాడు నారాయణమూర్తి.

"ఛీఛీ అనేది మీ ఊతపదంగా మారినట్టుంది" అన్నాడు మనోహరరావు తన కార్డ్సని గేమ్ గెలవడానికి అనుకూలంగా అరేంజ్ చేసుకుంటూ.

"రోజూ పేకాటమీద మీరింత డబ్బు తగిలేస్తోంటే మీ శ్రీమతిగారు ఎలా ఊరుకుంటున్నారు?" అన్నాడు ధర్మారావు.

"రేపట్నించీ నేనిక ఈ క్లబ్బులో అడుగుపెట్టను" అన్నాడు నారాయణమూర్తి.

"ఈమాటను ఇదివరకు మీరు చాలాసార్లన్నారు" అన్నాడు సురేందర్‌రావు.

అందరూ నవ్వారు.

"ధర్మరాజంతటి వాడికే ఇలాంటి జూదం ఆడక తప్పలేదు. రాజ్యాన్ని, అన్నదమ్ముల్ని, చివరకు కట్టుకున్న భార్యను కూడా పోగొట్టుకున్నాడు. అయినా అతనికి బుద్ధిరాలేదు. దుర్యోధనుడు మళ్ళీ జూదం ఆడదాం రమ్మంటే వచ్చి మళ్ళీ ఒడిపోయాడు" అన్నాడు ధర్మారావు.

వాళ్ళలా మాట్లాడుకుంటూ కార్డ్స్ ఆడుతోంటే అక్కడకు ఒకప్పుడు సెంట్రల్ ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్‌లో పెద్ద ఉద్యోగిగా పనిచేసిన జనార్ధనరావనే ఆ క్లబ్బులో అందరికి బాగా తెలిసిన వ్యక్తి, వచ్చాడు. జనార్ధనరావును చూడగానే వాళ్ళు నల్గురు లేచి నిల్చొని గౌరవాన్ని ప్రదర్శిస్తూ నమస్కారం చేశారు.

"నమస్కారం జనార్ధనరావు గారూ! బావున్నారా? ఎంత కాలానికి కలిశారండీ! మీరు అకస్మాత్తుగా ఈ ఊరికి, ఈ క్లబ్బుకూ దూరమైపోవడం మమ్మల్నెంత బాధించిందో మీరూహించలేరు. మంచితనానికి మారుపేరైన మిమ్మల్ని ఈరోజు మేం మళ్ళీ చూడటం నిజంగా మా అదృష్టం" అన్నాడు మనోహరరావు జనార్ధనరావుతో షేక్‌హ్యాండ్ చేస్తూ. వెంటనే ఆ క్లబ్‌లో పనిచేసే అటెండర్‌ను పిలిచి ఓ కుర్చీ తెప్పించి జనార్ధనరావును తన పక్కనే కూర్చోబెట్టుకున్నాడు.

"వ్వాటె ప్లెజెంట్ సర్‌ప్రైజ్ జనార్ధనరావు గారూ! మిమ్మల్నిలా చూడటం... ఆ మధ్య మీరు స్టేట్స్‌కు వెళ్ళారని విన్నాను. ఇండియాకెప్పుడొచ్చారు" అన్నాడు నారయణమూర్తి.

"చాలాకాలమైంది" అన్నాడు జనార్ధనరావు.

"అవును... మీరు అమెరికా నుంచి వచ్చాక మనం ఒకసారి కలుసుకున్నాం... అప్పుడు మీరు మీ అమ్మాయికి పెళ్ళి కుదిరిందని, మీకు ఇన్విటేషన్ పంపిస్తానని చెప్పారు... మీ ఇన్విటేషన్ రానేలేదు. నేను చాలా చిన్నవాడిని కదా... మీకు గుర్తుండి ఉండదు లెండి" అన్నాడు సురేందర్‌రావు.

"అబ్బే! నేను ఎవర్నీ చిన్నవాళ్ళు అనుకోను. అసలు విషయం యేమిటంటే మా అమ్మాయి పెళ్ళి జరగనే లేదు" అన్నాడు జనార్ధనరావు.

"అయ్యో! మీ అమ్మాయి పెళ్ళి జరగనే లేదా? ఎందుకు?" అన్నాడు సురేందర్‌రావు.

"ఎవరో పుణ్యాత్ములు నా గురించి, మా ఆవిడ గురించి మాకు కాబోయే వియ్యంకులకు అవాకులు, చెవాకులు చెప్పి ఆ పెళ్ళి జరగకుండా చేశార్లెండి" అన్నాడు జనార్ధనరావు.

"అయ్యో పాపం! ఎంత దారుణం. మీలాంటి మంచి మనిషినిని గురించి కూడా చెడ్డగా చెప్పేవాళ్ళుంటారని నమ్మలేకుండా ఉన్నాను జనార్ధనరావు గారూ! మన సమాజంలో మీలాంటి అతిమంచి మనుషులకు చోటు లేదండి. అసలు మీరిప్పుడేం చేస్తున్నారు? ఏ ఊర్లో సెటిలయ్యారు? ఇప్పుడు మీ ఆవిడగారేం చేస్తున్నారు? మీ ఆవిడగారెంత మంచి టీచరో! మా అమ్మాయి మీ ఆవిడ దగ్గరే చదువుకునేది. దానికి చదువుతోపాటు సంస్కారం కూడా నేర్పించింది మీ ఆవిడే! మా అమ్మాయి మీ ఆవిడనెప్పుడూ గుర్తుచేస్తుంటుంది. దానికి పెళ్ళి సంబంధం కుదిర్చింది కూడా మీ ఆవిడే!" అన్నాడు మనోహరరావు.

"గవర్నమెంట్ టీచర్‌గా రిజైన్‌చేసి మా ఆవిడిప్పుడో స్వంత స్కూలును నడుపుతోందండి. ఇప్పుడు ఆ స్కూలే మా కుటుంబానికింత తిండి పెడ్తోందండీ! ఆ స్కూలే లేకపోతే మా కుటుంబం వీధిలో పడిపోయేది" అన్నాడు జనార్ధనరావు.

"అయ్యో! ఎంత గొప్పగా బతికారు మీరు! మీకిలాంటి పరిస్థితొచ్చిందంటే చాలా బాధ కల్గుతోంది. అసలు మీరిప్పుడేం చేస్తున్నారు?" అడిగాడు మనోహరరావు.

"మా బాస్‌గారు నామీద ఓ ఫాల్స్ కంప్లైయింటిచ్చి నా ఉద్యోగం పోయేలా చేశాడు కదా! ఆ తర్వాత కొంతకాలం రెడీమేడ్ గార్మెంట్స్ బిజినెస్ చేశాను. పెద్దగా కలిసిరాలేదు. నా పార్ట్‌నర్ మోసం చేశాడు. స్టేట్స్‌లో ఉన్న ఓ మిత్రుడు హెల్ప్ చేస్తానంటే అమెరికా వెళ్ళాను. ఐదారు నెలలున్నాను. ఎంతో హెల్ప్ చేస్తానన్న మిత్రుడు

తన పనిలో తనుండిపోయి నన్నేమీ పట్టించుకోలేదు. ఇండియాకొచ్చేశాను. ఈ ఊర్లోఉన్న మిత్రుడొకడు ఓ కొత్త బిజినెస్ స్టార్ట్ చేద్దాం రమ్మంటే నిన్ననే వచ్చాను. ఈ క్లబ్‌లో మీలాంటి చాలామంది ఫ్రెండ్స్ ఉన్నారుకదా! మిమ్మల్నందర్నీ ఓసారి చూసిపోదామని ఇలా వచ్చాను" అన్నాడు జనార్ధనరావు.

"ఆరోజుల్లో మీరెందరికో సహాయం చేశారు. ఇప్పుడు మీరు కష్టాల్లో ఉన్నప్పుడు మీకెవరూ సహాయం చెయ్యడానికి ముందుకు రాకపోవడం చాలా అన్యాయం జనార్ధనరావు గారూ! మీరారోజుల్లో నాక్కూడా ఓ సహాయం చేశారు... మీకు గుర్తుందో లేదో?" అన్నాడు నారాయణమూర్తి.

"నాకు గుర్తులేదండి" అన్నాడు జనార్ధనరావు.

"మీకారోజుల్లో అప్పటి మా వైస్ ఛాన్సలర్ బెస్ట్‌ఫ్రెండ్‌గా ఉండేవాడు. ఆయనకు చెప్పి మీరే నాకు ప్రొఫెసర్‌గా ప్రమోషన్ ఇప్పించారు. మీరే గనుక అప్పుడు నాకా సహాయం చెయ్యకపోతే ఇప్పటికీ నేను రీడర్‌గానే ఉండిపోయేవాణ్ణి" అన్నాడు నారాయణమూర్తి.

"ఔనౌను... మీరు చెబుతోంటే గుర్తొచ్చింది. అప్పటి మీ వీ.సీ. పరమేశ్వరరావు వాజ్ మై బెస్ట్‌ఫ్రెండ్... మీ ప్రమోషన్ విషయంలో యేదో ప్రాబ్లెమ్ వస్తే నేనే ఆయనకు ఆ ప్రాబ్లెమ్‌ను ఇగ్నోర్ చెయ్యమని చెప్పాను" అన్నాడు జనార్ధనరావు.

"జనార్ధనరావు గారితో సహాయం పొందని వాళ్ళెవరున్నార్లెండి.... ఆయన అందరికీ ఆపద్బాంధవుడిగానే ఉండేవాడు. అపకారికి కూడా ఉపకారం చేసేటంత మంచి వ్యక్తి" అ న్నాడు మనోహరరావు.

"నాక్కూడా ఓసారి జనార్ధనరావు గారు సహాయం చేశారు... నాకోసారి చాలా దూరం ట్రాన్స్‌ఫర్ అయ్యింది. జనార్ధనరావు గారే అప్పటి జెడ్.పి. ఛైర్మన్‌కు చెప్పి నా ట్రాన్స్‌ఫర్‌ను ఇక్కడికి చాలా దగ్గరి ఊరికి మార్పించారు" అన్నాడు సురేందర్‌రావు.

"నాకిది కూడా గుర్తులేదు" అన్నాడు జనార్ధనరావు.

"మీరు చేసిన మేలును మీరు మరచిపోయినా మేం మరచిపోలేం కదా!" అన్నాడు సురేందర్‌రావు.

"నేవెళ్తా మనోహర్‌రావు గారూ! మిమ్మల్నందర్నీ ఇలా కలుసుకున్నందుకు చాలా సంతోషిస్తున్నాను" అంటూ జనార్ధన్‌రావు లేచి నిల్చున్నాడు.

"అయ్యో! అప్పుడే వెళ్ళిపోతారా? మీరొచ్చినందుకు సెలబ్రేషన్ చేసుకోవద్దా? రెండు పెగ్గులు విస్కీ..." అన్నాడు మనోహరరావు.

"విస్కీ తీసుకోవడం ఎప్పుడో మానేశాను... ప్లీజ్ గో ఆన్... నేనొచ్చి మీ ఆటను డిస్టర్బ్ చేసినట్టున్నాను... అందరికీ నమస్కారం" అంటూనే జనార్ధనరావు అక్కడ్నించి వెళ్ళిపోయాడు.

జనార్ధనరావు అక్కడ్నించి వెళ్ళిపోగానే వాళ్ళు ఒకరి మొహాలొకరు చూసుకున్నారు. ఆయన క్లబ్‌లోంచి బయటకు వెళ్ళిపోయాడని నిర్ధారించుకున్న తర్వాత

"అసలు ఈయన గారి ఉద్యోగం ఎందుకు పోయిందో తెలుసా?" అన్నాడు మనోహరరావు.

"అతడే చెప్పాడుగా... వాళ్ళ బాస్ ఇతనిమీద యేదో ఫాల్స్ కంప్లెయింటిచ్చాడని..." అన్నాడు సురేందర్.

"అది అబద్ధంలే... అసలు సంగతేమిటంటే ఇతడు వాళ్ళ బాస్ భార్యకే లైన్ వేయడం మొదలెట్టాడట. ఆమె కూడా త్వరలోనే ఇతని వలలో పడిపోయిందట. దాంతో వీళ్ళ బాస్ యేదో కేసులో ఇతన్ని ట్రాప్‌చేసి ఎవడి దగ్గర్నుంచో లంచం తీసుకుంటోంటే రెడ్‌హాండెడ్‌గా యాంటీ కరెప్షన్ బ్యూరో వాళ్ళకు పట్టించేశాట్ట" అన్నాడు మనోహరరావు.

"అలాగా! చూడటానికైతే చాలా మంచివాడిలా కనిపిస్తాడే... ఇతనిది అడిగినవాళ్ళకల్లా సహాయం చేసే స్వభావమని చెబుతారే! మనం కూడా అతనితో సహాయం పొందినవాళ్ళమేగా" అన్నాడు సురేందర్.

"అతని అసలు స్వరూపం బయటపడకుండా ఉండటం కోసం అలా అందరికీ సహాయం చేసే మనిషిలా కనిపించాలని ప్రయత్నిస్తాడేమోనని నా అభిప్రాయం" అన్నాడు మనోహరరావు.

"నేను ఇతన్ని గురించి మరోవార్త కూడా ఎవరో చెప్పగా విన్నాను. ఇతడు నకిలీ ప్యాస్‌పోర్టుతో స్టేట్స్‌కు వెళ్ళాడట. అక్కడ పట్టుబడి కొంతకాలం శ్రీకృష్ణ జన్మస్థానంలో గడిపాడట" అన్నాడు ప్రొఫెసర్ నారాయణమూర్తి.

"అతడో పెద్ద బూజర్ అనికూడా చెప్పుకుంటారు. భార్య కష్టపడి సంపాదించిన డబ్బునంతా ఇతడు తాగుడుమీద తగలేస్తాడట. తాగొచ్చి భార్యతో గొడవ పెట్టుకొని ఆమెను కొడ్తాడట కూడా" అన్నాడు మనోహరరావు.

కాస్సేపు మాటలు ఆపేసి వాళ్ళు పేకాటమీద తను దృష్టినంతా కేంద్రీకరించారు.

"నాకేం బాగనిపించటం లేదు... ఆడింది చాలు. మనమిక లేద్దాం" అన్నాడు సురేందర్‌రావు చేతిలో ఉన్న కార్డ్సుని కింద పడేసి.

"యేమైంది? ఎందుకు బాగనిపించటం లేదు. ఇంకో రెండు గేములు ఆడాక లేద్దాం" అన్నాడు మనోహరరావు తన చేతిలో ఉన్న కార్డ్సుని అలాగే తన వక్షస్థలానికి ఆనించుకుంటూ.

"అతడు కనిపించగానే అందరం అతన్ని పొగిడాం. అతడు కాస్త కనుమరుగు కాగానే అతన్ని గురించి ఇలా చెడ్డగా మాట్లాడుకుంటున్నాం. మనం అతన్ని గురించి చెప్పుకున్నవన్నీ కేవలం పుకార్లు మాత్రమే. అతనిచేత సహాయం పొందిన మనం కూడా అతడ్ని గురించిన ఈ పుకార్లను నమ్మినందుకు నేను చాలా గిల్టీగా ఫీలౌతున్నాను" అన్నాడు సురేందర్‌రావు.

"నిజమే. నేను కూడా మీలాగే ఫీలౌతున్నా సురేందర్. నిజమేమిటో తెలియకుండా మనందరికీ యేదో రకంగా సహాయం చేసిన ఓ మంచివ్యక్తిని గురించి..."

నారాయణమూర్తి పూర్తిచెయ్యకుండానే

"నిజమేమిటో నాకు తెలుసు" అన్నాడు అంతసేపూ నిశ్శబ్దంగా వుండిపోయిన ధర్మారావు.

"మీకు నిజమేమిటో తెలుసా? అయితే చెప్పండి" అన్నాడు మనోహరరావు.

"అతడు నాకూ బాగా తెలుసు. కానీ అతడు నన్ను గుర్తుపట్టలేదని నేనతనితో మాట్లాడలేదు. మీలాగ నేనతనితో ఎలాంటి సహాయాన్ని పొందలేదు. అతడు నా దగ్గరకు ఇన్‌కమ్‌టాక్స్ రిటర్న్సు ఫైలు చెయ్యడం గురించి వస్తుండేవాడు. అతడు నిజంగా మంచివాడే. ఇతన్ని ట్రాప్ చేసిన వీళ్ళ బాస్ కూడా నాకు తెలుసు. వాడే ఒక రోగ్. వాడిపేరు భుజంగరావు. వాడు కూడా నాదగ్గర ఇన్‌కమ్‌టాక్సు రిటర్న్సు గురించి వస్తుండేవాడు. వాడోసారి ఈ జనార్ధనరావుతో ఓ పాడుపని చేయించబోయాడు. ఆ పాడుపని చెయ్యడానికి జనార్ధనరావు అంగీకరించలేదు. ఆ కోపంతోనే వీళ్ళ బాస్ ఇతన్నో కరప్షన్ కేసులో ఇరికించాడు" అన్నాడు ధర్మారావు.

"జనార్ధనరావుతో వాళ్ళ బాస్ చేయించబోయిన ఆ పాడుపని యేమిటో?" అన్నాడు సురేందర్‌రావు.

"వాళ్ళ ఆఫీసులో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఓ అమ్మాయి మీద – ఆ అమ్మాయి పేరు గౌరి – భుజంగరావు కళ్ళుపడ్డాయి. ఆ అమ్మాయి

జనార్ధనరావును తన గురువుగా భావించి ఎంతో గౌరవించేది. ఎందుకంటే జనార్ధనరావు ఆమెకు ఆఫీసులో యేపని ఎలా చెయ్యాలో చెబుతుండేవాడు. ఆఫీసులో ఆమెకు ఎలాంటి సమస్య ఎదురైనా జనార్ధనరావు ఆమెకు సహాయం చేస్తుండేవాడు. వాళ్ళిద్దరి మధ్య గురుశిష్య సంబంధం తప్ప మరేవిధమైన సంబంధం ఉండేదికాదు. అయినా వాళ్ళిద్దరి మధ్య ఇంకేదో అక్రమ సంబంధం ఉండేదని భుజంగరావులాంటి రోగ్స్ పుకార్లు పుట్టించేవాళ్ళు. ఒకసారి ఈ భుజంగరావు జనార్ధన్‌రావును తన గదికి పిలిచి మీ గౌరితో నాకో రాత్రి గడిపే అవకాశం ఇప్పించవా? నువ్వు చెబితే అది తప్పకుండా నాక్కా ఆ అవకాశం ఇస్తుంది అన్నాట్ట. ఆమాట వినగానే జనార్ధనరావు చాలా వయలెంట్‌గా రియాక్టయ్యాడు. "నీకేమన్న బుద్ధుందా స్కౌండ్రెల్ అని భుజంగరావు కాలర్ పట్టుకొని చెంప చెళ్ళుమనిపించి అతని గదిలోంచి బయటకొచ్చాడు. ఆ తర్వాత ఈ విషయం జనార్ధనరావు ఎవరితోనూ చెప్పలేదు. భుజంగరావుతో పూర్వంలాగే వర్కింగ్ రిలేషన్‌షిప్ కొనసాగించాడు. ఒకరోజు భుజంగరావు వాడి మనిషితో పదివేల రూపాయల్ని జనార్ధనరావుకిచ్చి రమ్మని పంపించి ఏసీబి వాళ్ళకు ఇన్‌ఫామ్ చేశాడు. "మీరు చేసిన సహాయానికి థాంక్స్!" అంటూ భుజంగరావు పంపించిన మనిషి జనార్ధనరావు ఇంటికెళ్ళి ఆ డబ్బిచ్చాడు. ఆ డిపార్ట్‌మెంట్‌లో ఇలాంటి మామూళ్ళు మామూలే. జనార్ధనరావు ఎవరినీ లంచం అడిగేవాడు కాడు. కానీ ఎవరన్నా తమంతట తాముగా తెచ్చిస్తే గట్టిగా వద్దనేవాడు కాడు. ఆరోజు అలా అతడిచ్చిన డబ్బు తీసుకుంటుండగానే ఏసీబి అధికారులొచ్చి పట్టుకున్నారు...." అన్నాడు ధర్మారావు.

"ఆశ్చర్యంగా ఉందే!" అన్నాడు మనోహరరావు.

"అతడు పెద్ద బూజర్ కూడా కాడు. భార్యను కొడ్తాడనడం కూడా పచ్చి అబద్ధం. మనలాగే అతడు ఈ క్లబ్‌కొస్తున్న రోజుల్లో ఓ రెండు పెగ్గులు తీసుకుంటుండేవాడు. అతడు నకిలీ పాస్‌పోర్టుతో అమెరికా వెళ్ళాడన్నది కూడా అబద్ధమే. మీరింతకు ముందు చెప్పుకున్నట్టు అపకారికి కూడా ఉపకారం చేసే స్వభావం అతనిది" అన్నాడు ధర్మారావు.

"ఇవన్నీ మీకెలా తెలుసు?" అన్నాడు మనోహరరావు.

"జనార్ధనరావును ఇలా నేనే ట్రాప్ చేశానని భుజంగరావే నాతో స్వయంగా చెప్పాడు. గౌరితో ఒకరాత్రి గడిపే ఛాన్స్ ఇప్పించమని భుజంగరావు తనను అడిగినట్టు జనార్ధనరావు చెప్పాడు. అది నిజమేనని భుజంగరావు అంగీకరించాడు. "ఎప్పుడూ

దాన్ని నువ్వే ఉపయోగించుకుంటావా? నాకూ ఒక ఛాన్స్ ఇప్పించమన్నాను. తప్పా?" అని భుజంగరావు నాకు చెప్పాడు" అన్నాడు ధర్మారావు.

"ఆశ్చర్యమేమిటంటే అంత మంచిమనిషిని గురించి ఇలాంటి పుకార్లు పుట్టడం. వాటిని అతనితో సహాయం పొందిన మనం కూడా నమ్మి ప్రచారం చెయ్యడం" అన్నాడు సురేందర్.

"అందుక్కారణమేమిటో నేను చెప్పనా? ఓ వ్యక్తి చాలా మంచివాడంటే మనం నమ్మలేం. మనకంటే మంచివాళ్ళు ఉంటారంటే మనలోని అహం అంగీకరించదు. వాడూ నాలాంటి వాడే అయ్యుంటాడులే అని మనలో మనం అనుకుంటాం. ఎందుకంటే మనం చాలా మంచివాళ్ళం కాదని మన అంతరాత్మలకు తెలుసు కాబట్టి. మంచివాడన్న ముద్రపడిన మనిషిని గూర్చి అతడు మనం అనుకుంటున్నంత మంచివాడు కాదని చెప్పడానికేదన్నా ఒక పుకారు బయల్దేరిందనుకో... అలాంటి పుకారును మనకు వెంటనే నమ్మబుద్ధవుతుంది. అతడు మంచివాడని తెలిసినప్పుడు మనం అంతమంచివాడు అయ్యుండడులే అని మనం అనుకున్నది నిజమైందని సంతోషించి ఆ పుకారును ప్రచారం చెయ్యాలని కూడా అనుకుంటాం" అన్నాడు ధర్మారావు.

"నిజమే సుమా!" అన్నారు మిగతా ముగ్గురు ఒకేసారి.

'సాక్షి' డైలీ ఆదివారం అనుబంధం *(6-12-2009)*